క్లుప్తంగా

మిర్యాలగూడ రూరల్ సీఐ బదిలీ


వీరబాబు, నూతన సీఐ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ ముత్తినేని సత్యనారాయణను హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ చేస్తూ హైదరాబాద్ మల్టీజోన్–2 ఐజీ తరుణ్ జోషి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం సూర్యాపేట ఇంటిలిజెన్స్ సీఐగా పనిచేస్తున్న కట్టెకోల వీరబాబను మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన సీఐ వీరబాబు సోమవారం లేదా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

ఎస్‌ఐగా సతీష్ వర్మ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ

మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా జి. సతీష్ వర్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులును నల్లగొండ వీఆర్‌కు అటాచ్ చేయగా.. ఆయన స్థానంలో సూర్యాపేటలో వీఆర్‌లో ఉన్న సతీష్ వర్మ బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని నూతన ఎస్‌ఐ అన్నారు.

కొండమల్లేపల్లి సీఐగా ధనుంజయ


ధనుంజయ

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి సీఐగా ధనుంజయ నియమితులయ్యారు. ఇక్కడ సీఐగా పనిచేసిన రాఘవేందర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా ఆదిబట్లకు బదిలీ అయ్యారు.

ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: బైక్‌లపై ప్రమాదకర రీతిలో విన్యాసాలు చేస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎంఐఎం జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారూఖ్ ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడ టూటౌన్ ఎస్‌ఐ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫారూఖ్ మాట్లాడుతూ.. కొందరు యువకులు పట్టణంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తుండడం వలన ఇతర వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, మద్యం, గంజాయి సేవించి బైక్‌లు నడుపుతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఎంపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోసిన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య, సామాజిక నాయకులు ఎండీ గౌస్, సమీ తదితరులున్నారు.

కౌండిన్య గౌడ సంఘం జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్‌గౌడ్


కౌండిన్య గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రసాద్‌తో సభ్యులు

మిర్యాలగూడ టౌన్: కౌండిన్య గౌడ సంఘం నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన యడవెల్లి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కేఎల్‌ఎస్ ప్రసాద్ చేతులమీదుగా ఆదివారం నల్లగొండలో ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా యడవెల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి, గీత కార్మికుల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం


సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

మిర్యాలగూడ: సర్పంచ్‌గా ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. అభివృద్ధిలో శ్రీనివాసనగర్ గ్రామాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపి 20 అవార్డులు వచ్చేలా సర్పంచ్ కృషిచేశారని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుజాత, పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

నల్లగొండటౌన్: మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడం హర్షణీయమని మున్నూరు కాపు మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల రాములు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల మున్నూరు కాపులకు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.

సొంత భవనాల నిర్మాణమెప్పుడో..?

- అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్యాలయాలు


తేనపల్లి తండాలో పాఠశాల భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

గుర్రంపోడు: మండలంలోని పలు గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య కార్యాలయాలు నడుస్తున్నాయి. గుర్రంపోడు మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 16 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో మండలంలో మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 37కు చేరింది. గతంలో గల 21 గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ నిధులతో సొంత భవనాలు నిర్మించారు. ఒక్కో గ్రామ పంచాయతీ భవనాన్ని రూ.16లక్షలతో నిర్మించారు. ఉపాధి హామీ పథకం నిధులతో నూతన గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరవుతాయని కొందరు సర్పంచులు గతంలో ఆయా గ్రామాల్లో స్థలాలను సైతం ఎంపిక చేశారు. కొన్నిచోట్ల అనుమతులు లభించినా ఉపాధి హామీ బిల్లులు చేతికందేసరికి రెండేళ్ల సమయం పడుతుందని సర్పంచులు పనులు ప్రారంభించనే లేదు. అద్దె భవనాల్లో వసతులు లేకపోవడంతో సర్పంచులు, పాలకవర్గ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుర్రంపోడు మండల కేంద్రంలోనూ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తిగా మిలిగిపోయింది.

పంచాయతీ రికార్డులకు రక్షణ కరువు

పంచాయతీ రికార్డులను భద్రపర్చడంలోనూ పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమైన రికార్డులను సర్పంచుల ఇళ్లలో లేదా తమ వద్దనో ఉంచుకోవాల్సి వస్తుందని వారు అంటున్నారు. గ్రామాల్లో స్థానికంగా ఉండని, వలస వెళ్లిన వారి ఇళ్లలో గ్రామ పంచాయతీ కార్యాలయాలు నిర్వహిస్తుండటంతో పంచాయతీ కార్యదర్శులు నీటి వసతి, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. మొదట్లో పంచాయతీ కార్యాలయాలకు ఇళ్లను ఇచ్చిన వారు ఖాళీ చేయాలని అంటుండటంతో మరో ఇల్లు వెతుక్కోవాల్సి వస్తుందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఇరుకైన గదుల్లో తరచూ గ్రామ పంచాయతీ సమావేశాలు నిర్వహించడం కష్టంగా ఉందని సర్పంచులు అంటున్నారు. మండలంలోని చామలోనిబావి గ్రామ పంచాయతీ కార్యాలయానికి అద్దె భవనం లభించక ఇరుకైన పాఠశాల వంట గదిని గ్రామ పంచాయతీ కార్యాలయంగా వినియోగిస్తూ ఆరుబయట సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల రైతు వేదికలు, పాఠశాల గదుల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాలుగా వినియోగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనం లేదు



తేనపల్లి తండా గ్రామ పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేక ఇబ్బందిగా ఉంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒక గదిని గ్రామ పంచాయతీ కార్యాలయంగా తాత్కాలికంగా వినియోగిస్తున్నాం. నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మించే దిశగా అధికారులు ప్రయత్నించాలి.

– వడిత్య రజిత, సర్పంచ్, తేనపల్లి తండా

ప్రతిపాదనలు పంపాం



గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని గతంలోనే అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నూతన గ్రామ పంచాయతీలకు నిధులు ఇంకా మంజూరు కావడంలేదు. నిధులు మంజూరు కాగానే భవనాలలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీపాద సుధాకర్, ఎంపీడీఓ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి


దేవరకొండ: పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


డిండి: సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ: ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నక్క వెంకటేశ్వర్లు, చందర్‌నాయక్, నారాయణసింగ్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, ధర్మానాయక్, కొండయ్య తదితరులున్నారు.

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

డిండి: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం డిండి మండల పరిధిలోని రహమంతాపూర్ నుంచి చెర్కుపల్లి వరకు రూ.3.78 కోట్లతో, శాంతిగూడెం నుంచి కందుకూర్ వరకు రూ.3.25 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్ల పనులకు, ప్రతాప్‌నగర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వావిల్‌కోల్, ఖానాపూర్, టి.గౌరారంలో సీసీ రోడ్లను, చెర్కుపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డిండి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీ పనులను పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీటిని అందిస్తామన్నారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల లోపే అర్హులందరికీ అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీతాజనార్దన్‌రావు, ఎంపీడీఓ డేనియల్, పీఆర్ ఏఈ విజయ్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, సర్పంచ్‌లు దామోదర్‌రావు, ఇందిరాభాస్కర్‌రెడ్డి, సుధామణివెంకట్‌రెడ్డి, లక్ష్మీతిరుపతి, విజయేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, ఎంపీటీసీలు శేఖర్‌రెడ్డి, శ్రీలత, నాయకులు యాదగిరిరావు, లక్పతినాయక్, రేఖ్యానాయక్, బద్దెల శ్రీను, గిరీష్‌యాదవ్, దామోదర్‌రెడ్డి, కాశన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు పాటుపడాలి


మహిమూద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు

మిర్యాలగూడ అర్బన్: ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి అమరులైన సీపీఎం నాయకుల ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కమ్యూనిస్టు నాయకుడు మహిమూద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో జూలకంటి రంగారెడ్డి పాల్గొని మహిమూద్ చిత్రపటానికి నివాళులర్పించారు. మిర్యాలగూడ పట్టణంలో సీపీఎం బలోపేతానికి మహిమూద్ చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, సత్యనారాయణరావు, పాదూరి గోవర్ధని, కోటిరెడ్డి, మల్లయ్య, దూవయ్య, చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు

వేములపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పనిచేస్తున్న పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం వేములపల్లి మండల కేంద్రంలో గీత కార్మిక సంఘం కార్యదర్శి పుట్టల రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేములపల్లి మండలంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సర్వీస్ రోడ్డు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మండలంలో ఇప్పటికే అనేక రైస్ మిల్లులు ఉండడంతో వాయు కాలుష్యం ఎక్కువైందని, తిరిగి కొత్త మిల్లులకు అనుమతి ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి జిల్లా యాదగిరి, నాయకులు పుట్టల రాములు, పల్లా వెంకన్న, పుట్టల కృష్ణయ్య, వల్లంపట్ల వెంకన్న, పద్మ, సత్యం, కృష్ణయ్య, కొండయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్: మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకు 14గంటల పాటు పనిచేయిస్తున్నారని, ఓటీని కేవలం రెండు గంటలకే చెల్లించడంతో కార్మికులు నష్టపోతున్నారని అన్నారు. మహిళలు అదనపు గంటలు పనిచేయడం వలన అనారోగ్యాల పాలవుతున్నారు. ఆయన వెంట రీజినల్ సెక్రటరీ సుధాకర్, పగిళ్ల కృష్ణయ్య, వినయ్‌కుమార్, రాములు, జానయ్య, రాంరెడ్డి తదితరులున్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

చిట్యాల: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ నాయకులు సన్నద్ధం కావాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. చిట్యాల మండలం నేరడ గ్రామంలో ఆదివారం బీజేపీ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రంలో మరోమారు బీజేపీని గెలిపించాలని కోరారు. అనంతరం వికసిత్ భారత్ క్యాలెండర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ మైల నర్సింహ, కోకన్వీనర్ మాడూరి ప్రభాకర్‌రావు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పాపని వజన వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి


క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతిఒక్కరు జీవితంలో ముందుకు సాగాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. సంఘం అధ్యక్షుడు మాడ్గుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రావిరాల అంజయ్య, కార్యదర్శి కొత్తపల్లి బాబురావు, జిల్లా నాయకులు కత్తుల మహేష్, జయపాల్, సందీప్, సింగం శ్రీనివాస్, కోడిరెక్క శైలజ, మాజీ జెడ్పీటీసీ దోసపాటి శ్రీనివాస్, శ్రీరాములు, మధు, దివాకర్, రాంబాబు, ఆమోస్, మట్టయ్య తదితరులున్నారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తా..

పద్మశాలీల సంక్షేమం కోసం తన వంతు కృషిచేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని పద్మశాలీ భవనంలో పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘం మిర్యాలగూడ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెల్లా రాంబాబు, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారిగా మసురం కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా పిల్లలమర్రి రమేష్, బిల్లా ప్రభాకర్‌రావు, బి. లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులుగా రావిరాల నాగేందర్, పిల్లలమర్రి ప్రసాద్, ముషం నర్సింహప్రసాద్‌తో పాటు మరో 9మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, సంఘం కన్వీనర్ బావండ్ల పాండు, కోకన్వీనర్ రాపోలు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు అమతం దుర్గాసత్యం, చిలుకూరి సక్కుబాయి, చిలుకూరి రమాదేవిశ్యాం తదితరులు పాల్గొన్నారు.

చిన్యానాయక్ సేవలు మరువలేనివి


చిన్యానాయక్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం కొత్తపేటతండాకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ధనావత్ చిన్యానాయక్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం కొత్తపేటతండా గ్రామంలో చిన్యానాయక్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఆంగోతు హాతీరాంనాయక్, శంకర్‌నాయక్, ధీరావత్ స్కైలాబ్‌నాయక్, ధీరావత్ రవితేజనాయక్, గ్రామ సర్పంచ్ ధనావత్ శాంతిప్రకాశ్, ఎంపీటీసీ వీరానాయక్, ఉప సర్పంచ్ జ్యోతినాగునాయక్, సచిన్, రాంసింగ్, రవినాయక్, శ్రీనునాయక్, దస్రునాయక్, బాలునాయక్, కిషన్‌నాయక్, సూర్యనాయక్, జాన్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీఐఈఓను సస్పెండ్ చేయాలి



మిర్యాలగూడ పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ)ను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ విద్యా వ్యవస్థను నీరుగార్చి జూనియర్ కళాశాలలు మూతపడటానికి డీఐఈఓ కారణమయ్యారని ఆరోపించారు. అనేక ప్రభుత్వ కళాశాలల్లో జరుగుతున్న తగాదాలకు డీఐఈఓనే కారణమని అన్నారు. చిన్న సమస్యను పరిష్కరించకుండా తన స్వలాభం కోసం ఉపయోగించుకోవడం వలన ఓ ప్రిన్సిపాల్ సస్పెండ్ అయ్యాడని తెలిపారు. అవసరం లేని చోట ఖాళీలకు అనుమతి రాయడంతో పాటు సౌకర్యాలు లేని కాలేజీలకు అనుమతులు ఇస్తున్నాడని ఆరోపించారు. ప్రాక్టికల్స్ పరీక్షల్లో అనే కాలేజీలకు ల్యాబ్స్ లేకున్నా.. ప్రాక్టికల్స్ చేయకున్నా లంచాలు తీసుకుని వదిలేస్తున్నారని విమర్శించారు. ఇంటర్ విద్యావ్యవస్థను అభాసుపాలు చేసేలా వ్యవహరిస్తున్న డీఐఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని లేదంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వదూద్, కళ్యాణ్, రిహాన్ తదితరులున్నారు.

నక్కలగండి సొరంగ మార్గాన్ని పూర్తిచేయాలి

మునుగోడు: నక్కలగండి సొరంగ మార్గాన్ని వెంటనే పూర్తిచేసి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడులోని పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గ్రామాల్లో బెల్టు షాపులను మూసివేయించడం హర్షణీమని, అందుకు ప్రతి సీపీఐ కార్యకర్త, నాయకుడు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు దుబ్బ వెంకన్న, ఎండీ జానీ, రేవెల్లి అంజయ్య, కుమర్తి ముత్తయ్య, చాపల విప్లవ్, బెల్లం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల నిర్మాణాన్ని ఆపాలి

గట్టుప్పల్ (చండూరు): గాలి నీరు పర్యావరణాన్ని కలుషితం చేసే రసాయనిక పరిశ్రమలను గ్రామాల్లో నిర్మించకుండా ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గట్టుప్పల్, మునుగోడు మండలం కృష్ణాపురం గ్రామాల్లో రసాయనిక పరిశ్రమలు ఏర్పాటుచేస్తున్నారని అన్నారు. ఇప్పటికే చౌటుప్పల్‌లో ఉన్న పరిశ్రమల వల్ల ప్రజలు అనేక రకలుగా వ్యాధులతో సతమతమవుతున్నారని, ఈ ప్రాంతమంతా కాలుష్యం ఏర్పడి వ్యవసాయానికి పనికిరాని భూములుగా మారిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లపురాజు రామలింగయ్య, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్,స సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య, చేనేత సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ధనుంజయ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, పెంటయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఐతరాజు లక్ష్మయ్య, లింగస్వామి, పెద్ద యాదయ్య, కట్ట చెన్నయ్య పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ


బంజారా ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి



బంజారా అఫీషియల్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌నాయక్

మిర్యాలగూడ: బంజారా ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్ బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్, గోపినాయక్, శ్రీనునాయక్, శ్రీనివాస్‌నాయక్, సైదానాయక్, విజయ్‌నాయక్, తిరుపతినాయక్, పార్వతీచౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

బంజారా అఫీషియల్ క్యాలెండర్, డైరీ..

తెలంగాణ రాష్ట్ర బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బంజారా అఫీషియల్ పేరుతో రూపొందించబడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం దామరచర్ల మండలం కొండ్రపోలు గ్రామంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదావత్ శరత్‌నాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ్‌నాయక్, గోపినాయక్, సైదానాయక్, శ్రీనివాస్‌నాయక్, సీతారాంనాయక్, జనార్దన్‌నాయక్, శ్రీధర్, జితేందర్, మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష


నాగార్జునసాగర్‌లోని బీసీ గురుకుల విద్యాలయంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నాగార్జునసాగర్: ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ కోసం పలు పాఠశాలల(నేషనల్ కాడెట్ కార్ప్స్)విద్యార్థులు ఆదివారం పరీక్ష రాశారు. సుబేదార్ షకీలామాల్ నాగార్జునసాగర్‌లోని బీసీ గురుకుల విద్యాలయంలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ద్వారా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌సీసీలో చేరుతారు. 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసి ఏ సర్టిఫికెట్ పొందుతారు. చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం నుంచి 25మంది విద్యార్థులు హాజరు కాగా, డీఏవీ పైలాన్ పాఠశాల నుంచి 34మంది, బీసీ గురుకుల విద్యాలయం నుంచి 84మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో కర్నూల్ లచ్చారెడ్డి, బీసీ స్కూల్ ప్రిన్సిపాల్ రజనీకాంత్, సంతోష్, మహేష్, వెంకటేష్, ఫణీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రంలో కుల గణనను చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని హాస్టల్లో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి కుల గణన ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో, బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అన్నారు. బీసీ కమిషన్ ద్వారా బీసీ కుల గణనను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రీనివాస్, నరేందర్, శివ, ఏడుకొండలు, గణేష్, సాయిరాం, మురళి, వంశీ, మణి, మధు, రవితేజ, సందీప్ తదితరులున్నారు.

పద్మశాలీ సంఘం బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న పున్నా రాములు

మిర్యాలగూడ టౌన్: పద్మశాలీ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని సంఘం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పున్నా రాములు అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడులో గల టీఎస్‌ఆర్ గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ స్థాయి పద్మశాలీ సంఘం కార్యవర్గాన్ని మార్కండేయ నందిపాడు పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు కొంగరి నారాయణ, అధ్యక్షులు జెల్లా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంతకుముందు నూతన అధ్యక్షుడు రాపోలు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిలువేరు భిక్షం, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, కోశాధికారి గుర్రం శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జి, ప్రచార కార్యదర్శి రావిరాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాస్‌ను నందిపాడు గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోవింద్‌రెడ్డి, పద్మశాలీ సంఘం నాయకులు రుద్ర సైదులు, బొల్ల రాం నర్సయ్య, బ్రహ్మయ్య తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని తొండల్‌వాయి గ్రామ పంచాయతీకి చెందిన మేడిపల్లి వెంకన్న ఇటీవల మృతిచెందాడు. ఆయనతో పాటు 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.68,611 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, నరేష్, సైదులు, బాబు, గిరి, కరుణాకర్, మల్లారెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.